క్లుప్తంగా

కత్తి గెలిచింది.. ఖాకీ ఓడింది



ముక్కామలలో జరుగుతున్న కోడిపందాలు

అంబాజీపేట: కోడి పందాలకు, గుండాటలకు ఎటువంటి అనుమతులు లేవని అధికారులు ఊకదంపుడు ప్రచారం చేసినప్పటికీ వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా పందెంరాయుళ్లు, కూటమి నాయకులు బరితెగించి బరులు సిద్ధం చేశారు. ముక్కామలలో జెడ్పీ హైస్కూల్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో సోమవారం ఉదయం కోడి పందాలు, గుండాటలను నిర్వహించారు. పందెంరాయుళ్లు కోడి పందాలను, గుండాటలను కొనసాగించారు.

భక్తులతో కిక్కిరిసిన అయినవిల్లి



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో పుష్పాకృతిలో విఘ్నేశ్వరుడు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం సంక్రాంతి సందర్భంగా సోమవారం దేశం నలు మూలలు నుంచి అత్యధిక సంఖ్యలో భక్తుల దర్శించుకున్నారు. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో విశేష పూజలు అభిషేకాలు జరిపారు. స్వామి వారి ఆలయ ప్రాంగణం రంగవల్లులు, వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భోగి మంటలు వేశారు. హరిదాసులు, గారడీ, వివిధ నృత్య ప్రదర్శనలు, డప్పు వ్యాయిద్యాలు ఏర్పాటు చేశారు. సుమారు 6,420 అన్నప్రసాదం స్వీకరించారు. స్వామికి సోమవారం ఒక్క రోజు రూ.6,50,409 లభించినట్లు ఆలయ ఈఓ, ఏసీ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. స్వామివారిని బుల్లితెర నటులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆకట్టుకున్న బొమ్మకొలువు, గొబ్బెమ్మలు



మామిడికుదురులో గొబ్బెమ్మలకు పూజలు చేస్తున్న మహిళలు

మామిడికుదురు: భోగి పండగ సందర్భంగా మామిడికుదురులో ధరణీప్రగడ గిరిజాకుమారి స్వగృహంలో సోమవారం ఏర్పాటు చేసిన బొమ్మలకొలువు విశేషంగా ఆకట్టుకుంది. పసుపు, కుంకుమతో గౌరీదేవిని పెట్టి పూజలు చేశారు. గొబ్బెమ్మల చుట్టూ పాటలు పాడారు. కార్యక్రమంలో మహిళలు, యువతులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.



మడికిలో గొబ్బెమ్మలకు పూజ, చిన్నారులపై భోగిపండ్లు పోసి ఆశీర్వదించిన దృశ్యం



అంబాజీపేటలో ప్రజ్వరిల్లుతున్న భోగి మంట

వైభవంగా భోగిభాగ్యాలు

- ఆకట్టుకున్న 1000 అడుగుల పిడకల దండ
- వైభవంగా గోదాదేవి కల్యాణం
- భోగిపళ్లతో చిన్నారులకు దీవెనలు

అలమూరు/కొత్తపేట/మలికిపురం/అంబాజీపేట/సఖినేటిపల్లి/పి.గన్నవరం/మామిడికుదురు: భోగి పర్వదినాన తెలుగు వాకిళ్లు సప్త వర్ణ శోభితమై గొబ్బెమ్మలతో కళకళలాడాయి. తెలుగు లోగిళ్లు పిండివంటలతో ఘుమఘుమలాడాయి. సాంస్కృతిక, వినోద కార్యక్రమాలతో గ్రామాలు సందడితో అలరించాయి. పెదపళ్లలో సుమారు 200 మీటర్ల పొడవైన భోగి దండను తయారు చేసి మంటల్లో వేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో ముఖ్య కూడళ్లలో పాత చెక్కసామానులను, కలప దుంగలను సేకరించి అక్కడక్కడా వేసిన బారీ భోగిమంటలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి.



కేశనపల్లిలో 1000 మీటర్ల భోగి పిడకల దండను ఊరేగిస్తున్న చిన్నారులు



పెదపళ్లలో పొడవైన భోగి దండను ఊరేగిస్తున్న భక్తులు



కొత్తపేటలో భోగిమంట వద్ద బాలలు



విశ్వేశ్వరాయపురంలో గుండాటలు



సఖినేటిపల్లిలంకలో సంక్రాంతి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దేవ

చిన్నారులకు భోగిపళ్లతో అక్షతలు

ధనుర్మాసం నెల రోజుల పాటు టీం హెడ్ యు.అమ్మాజీ నేతృత్వంలో జరిగిన నగర సంకీర్తన సోమవారంతో ముగిసింది. ఆ సందర్భంగా మడికిలోని వినాయక గుడి వద్ద గొబ్బమ్మలు పెట్టి చిన్నారులకు భోగిపళ్లు, అక్షతలు వేశారు. కొత్తపేటలో భోగిని సోమవారం ఆబాల గోపాలం కోలాహలంగా జరుపుకొన్నారు. స్థానిక హరిహర దేవాలయ ప్రాంగణంలోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయ మండపంలో గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మలికిపురంలో తొలిరోజు ప్రజలు ఉత్సాహంగా ఆనందోత్సాహాల మధ్య గడిపారు. తెల్లవారుజామునే భోగి స్నానాలు ఆచరించి భోగి మంటలు వేసుకున్నారు. రాజోలు దీవిలోని పలు గ్రామాల్లో కోడి పందాలు, గుండాటలు జోరుగా సాగాయి. కేశనపల్లిలో 1000 అడుగుల పిడకల దండను చిన్నారులు ఊరేగించి భోగి మంటలో వేశారు.

అంబాజీపేట మండలంలోని అంబాజీపేట, చిరతపూడి, ఇసుకపూడి, మాచవరం తదితర గ్రామాల్లో భోగి మంటలను యువకులు పెద్ద ఎత్తున వెలిగించేందుకు పోటీ పడ్డారు. అలాగే మండలంలోని ప్రధాన ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లిలంక గ్రామంలో సోమవారం భోగి, సంక్రాంతి, కనుమ పండగల సందర్భంగా స్థానికులు ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాల వేడుకలను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభించారు. తాత్కాలిక షామియానాలో కొలువుదీర్చిన కనకదుర్గ అమ్మవారి విగ్రహం వద్ద ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. అంతర్వేది లక్ష్మీనృసింహుని క్షేత్రం సోమవారం భోగి పర్వదినాన అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అంతర్వేది ఆలయంలో ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు కుటుంబ సభ్యులు, స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు వారికి స్వామి చిత్రపటం, లడ్డు ప్రసాదాన్ని ఏసీ అందజేశారు. పి.గన్నవరంలో మండలంలో భోగి పండగను ఘనంగా జరుపుకొన్నారు. గ్రామాల్లోని కూడళ్లలో భోగి మంటలు వేశారు. చిన్నారులు, పెద్దలు కొత్త దుస్తులు ధరించి భోగి మంటల చుట్టూ ప్రదక్షిణలు చేసి భోగి పిడకల దండలు చేశారు. ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులు, బంధువులు, వారి స్నేహితులు స్వగ్రామాలకు రావడంతో గ్రామీణ ప్రాంతాలు సందడిగా మారాయి. అలాగే రాజులపాలెంలో గ్రామస్తులంతా కలసి మూడు రోజుల పాటు సామూహిక సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నారు. గత 19 ఏళ్లుగా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. సంక్రాంతి పండగ మూడు రోజులపాటు గ్రామంలో ఎవరూ వంటలు చేసుకోరు. అందరూ కలిసి ఒకే చోట భోజనాలు చేస్తారు. ఈ ఏడాది వివిధ ప్రాంతాల నుంచి సుమారు 250 మంది గ్రామానికి విచ్చేశారు. స్థానిక క్షత్రియ సంఘ నాయకులు సంక్రాంతి సంబరాలకు తగిన ఏర్పాట్లు చేశారు.

వైభవంగా గోదారంగనాథుల కల్యాణం

అంబాజీపేట: అంబాజీపేట పెద్దవీధిలో వేంచేసిన సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన గోదాదేవి రంగనాథుల కల్యాణం వైభవంగా జరిగింది. ధనుర్మాస వ్రతానంతరం జగత్కల్యాణ కారకులైన గోదాదేవి రంగనాథులకు కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు ఖండవల్లి బదరి నారాయణాచార్యులు తెలిపారు. పి.గోపాలచార్యుల బ్రహ్మత్వంలో నారాయణచార్యుల ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో గోదాదేవి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఈ కల్యాణోత్సవంలో గ్రామానికి చెందిన రెడ్డి దుర్గా భవాని పాల్గొని వేద పండితులు విజయ్‌కుమార్ ఆచార్యుల మంత్రోచ్చారణల మధ్య గోదాదేవికి పూజలు నిర్వహించి నైవేద్యాన్ని సమర్పించారు. పరిసర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం దేవతామూర్తుల విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు.



గుమ్మిలేరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న గోదాదేవి కల్యాణం

సంస్కృతీసంప్రదాయాలను పరిరక్షించాలి

ఆలమూరు: భారత సాంస్కృతిక, సనాతన సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తూ గత 30 యేళ్ల నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ కృషి అభినందనీయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు చైర్మన్ ఆనంద తీర్థాచార్యులు అన్నారు. స్థానిక ఆలయ ఆవరణలో ఇటీవల కొత్తపేట, మండపేట నియోజకవర్గాల పరిధిలో అయ్యప్ప కమిటీ నిర్వహించిన రంగవల్లుల పోటీ విజేతలకు బహుమతుల పంపిణీ జరిగింది. ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ తెలుగు సంప్రదాయాలను, సంస్కృతిని, ఆధ్యాత్మికతను భావితరాలకు అందించాలని ఆయన ఆకాంక్షించారు. ఆలయం వద్ద ఏటా వ్యయ ప్రయాసలకోర్చి మకరజ్యోతి దర్శనాన్ని నిర్వహిస్తున్న ఎం.ముకేందరస్వామిని, కమిటీ ప్రతినిధులను ఆయన అభినందించారు.

సిద్ధమవుతున్న సంక్రాంతి ప్రభలు

15న జగ్గన్నతోటలో కనువిందు చేయనున్న ఏకాదశ రుద్రులు

అంబాజీపేట: సంక్రాంతి పండగలో ప్రధానమైనది ప్రభల ఉత్సవం. కనుమ రోజున మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో నిర్వహించే ప్రభల ఉత్సవం కోనసీమకే తలమానికం. 11 గ్రామాల నుంచి తరలివచ్చే ఈశ్వర రూపాల రుద్రప్రభలతో పాటు పిల్ల ప్రభలు తీర్థంలో పాల్గొంటాయి. ఈ నెల 15న జగ్గన్నతోటలో జరిగే ప్రభల తీర్థానికి ఆయా గ్రామాల్లో యువకులు ప్రభలను సిద్ధం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ప్రభలకు 450 ఏళ్ల పైబడి చరిత్ర ఉంది. లోకకల్యాణం కోసం పెద్దాపురం సంస్థానాధీశుడు రాజా వత్సావాయి జగన్నాథరాజు (జగ్గన్న) హయాంలో తొలిసారిగా 17వ శతాబ్దంలో ఈ తీర్థాన్ని మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో నిర్వహించారు. ఉత్తరాయణ ప్రవేశ ఏకాదశ రుద్రులను దర్శించుకుంటే శుభం జరుగుతుందనే ఉద్దేశంతో జగ్గన్నతోట ప్రభల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

తీర్థంలో కొలువుతీరే ప్రభలు

వ్యాఘ్రేశ్వరం వ్యాఘ్రేశ్వరస్వామి, కె.పెదపూడి మేనకేశ్వరస్వామి, గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి, గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి, వక్కలంక కాశీవిశ్వేశ్వరస్వామి, నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి, ముక్కామల రాఘవేశ్వరస్వామి, మొసలపల్లి మధుమానంత భోగేశ్వరస్వామి, పాలగుమ్మి చెన్నమల్లేశ్వరస్వామి, పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి ఇక్కడికి వస్తాయి. వ్యాఘ్రేశ్వరం నుంచి తరలివచ్చే వ్యాఘ్రేశ్వరస్వామి ఈ తీర్థానికి అధ్యక్షత వహిస్తారు. అలాగే కౌశిక అవతలి వైపునున్న గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం ప్రభలు కౌశికలో దిగి తీర్థంలో ప్రవేశించడం చూపరులను గగుర్పాటుకు గురి చేస్తుంది. తొండవరంలో జరిగే ప్రభల తీర్థంలో కొలువుతీరే వాకలగరువు, తొండవరం ప్రభలు జిల్లాలో అన్ని ప్రభల కంటే ఎత్తులో నిర్మించడం ప్రత్యేకత. సుమారు 55 అడుగులు ఎత్తులో ఉండే ఈ ప్రభలు ఒకదానికంటే ఒకటి పోటీ పడుతుంటాయి. చిరతపూడి చిట్టిచెరువు గట్టు వద్ద చిరతపూడి వీరభద్రస్వామి, కుందాలపల్లి, పప్పులవారిపాలెం, మోడేకుర్రు, చిట్టిచెరువు గట్టు, అవిడి, చినపాలెంలకు చెందిన ప్రభలు కొలువుతీరుతాయి.



గంగలకుర్రు అగ్రహారంలో ప్రభను సిద్ధం చేస్తున్న భక్తులు



నేదునూరులో ప్రభలను ముస్తాబు చేసేందుకు సిద్ధమవుతున్న సిబ్బంది

ప్రభల తయారీలో నిమగ్నం

అయినవిల్లి: ప్రభల తీర్థానికి అయినవిల్లి సిద్ధమవుతుంది. అయినవిల్లి, నేదునూరు, వీరవల్లిపాలెం, కె.జగన్నాథపురం, కొండుకుదురు ఇలా మండలంలోని పలు గ్రామాల్లో ప్రభల తీర్థం అంగరంగా వైభవంగా నిర్వహిస్తారు. ఇందుకు కోసం ప్రభల తయారీలో సిబ్బంది నిమగ్నమయ్యారు. వెదురు, తాటి వాసాలు, రంగు రంగుల వస్త్రాలు ఇలా పలు వస్తు సామగ్రితో ప్రభల తయారీలో బిజీగా నిర్వాహకులు ఉన్నారు. ప్రభలు తీసుకెళ్లేందుకు వీలుగా ఇనుప చక్రాలతో కూడిన రథాలను ఇప్పటికే తయారు చేయించారు. వాటిని తీసుకొచ్చి వాటిని శుభ్రం చేయించారు.

ఉమాకొప్పేశ్వరుల కల్యాణం

కొత్తపేట: మండలంలోని పలివెలలో వేంచేసిన ఉమాకొప్పేశ్వర స్వామి వారి కల్యాణం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. 111 ఏళ్ల తర్వాత వచ్చే పుష్యమాసం, స్వామివారి ఆరుద్ర జన్మనక్షత్రం, పౌర్ణమి, సోమవారం కలసి రావడంతో ఈ సోమవారం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ నేపథ్యంలో ఉమా కొప్పేశ్వర స్వామి భక్త కమిటీ సభ్యుడు, సోమవారం అన్నప్రసాద కమిటీ కన్వీనర్, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు-కాంతి భారతి విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ తోట శ్రీవాణి దంపతుల ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని విశేషంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పండితులు మైలవరపు భరద్వాజ్, కొడమంచిలి పవన్‌కుమార్ బృందం స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆద్యంతం పురాణ వ్యాఖ్యానంతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. పలివెల, కొత్తపేట పరిసర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు కల్యాణంలో పాల్గొన్నారు.



పలివెలలో ఉమాకొప్పేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న తోట వెంకటేశ్వరరావు దంపతులు

అన్‌స్టాపబుల్ పుస్తకం ఆవిష్కరణ

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో అన్‌స్టాపబుల్ పుస్తక ఆవిష్కరణ జరిగింది. జేఈఈ, ఎన్ఈఈటీ ప్రవేశ పరీక్షల్లో సులభంగా ర్యాంకులను సాధించేందుకు వీలుగా ఆలమూరు మండలంలోని చింతలూరుకు చెందిన ఎన్‌బీవీఎస్ ఎడ్యుకేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సుబ్బు ఇన్నోలేటివ్ క్లాస్ అధినేత నామాల బాల వెంకట సుబ్బారావు స్వయంగా ఈ పుస్తకాన్ని రాశారు. స్థానిక ఉన్నత పాఠశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో భాగంగా ఈ పుస్తకాన్ని పూర్వ గురువులతో ఆవిష్కరించారు. అనంతరం సహచర మిత్రులకు ఈ అన్‌స్టాపబుల్ పుస్తకాలను ఉచితంగా అందజేశారు.

ఆనాటి హృదయాల ఆనంద గీతం



అంబాజీపేటలో కలుసుకున్న 2002-03 పదో తరగతి విద్యార్థులు



అంబాజీపేటలో తోటి విద్యార్థులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు



మామిడికుదురులో సందడి చేసిన పూర్వ విద్యార్థులు



నగరంలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



రాజోలులో కలుసుకున్న 1989-90 బ్యాచ్ స్నేహితులు

అంబాజీపేట: చిన్ననాటి స్నేహానుబంధాన్ని మరోసారి ఆత్మీయ కలయిక ద్వారా పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. ఎప్పుడో 53 ఏళ్ల క్రితం పదో తరగతి కలసి చదువుకొన్న విద్యార్థులంతా ఏటా కలుసుకోవడం అపురూపమని జీవితంలో కలకాలం నిలిచేది స్నేహమేనని నిరూపించారు. పూర్వ విద్యార్థులు అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో 1972లో పదో తరగతి విద్యనభ్యసించిన ఫ్రెండ్స్ అసోసియేషన్ సోమవారం స్థానిక పాఠశాలలో సమావేశమయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడు హోమియోపతి వైద్యుడు యండమూరి ఫణీంద్రనాథ్, నాగాబత్తుల నరసింహమూర్తిల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొన్నారు. అనంతరం సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ వలీలను ఘనంగా సత్కరించారు. అలాగే స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విద్యనభ్యసించిన 2002-03 పూర్వ విద్యార్థులు ఒక వేదికపై కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

మామిడికుదురు: స్థానిక జెడ్పీహెచ్ స్కూల్‌కు చెందిన 1989-90లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు, నగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2001-02లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం సోమవారం ఘనంగా జరిగింది. పూర్వ విద్యార్థులు తమకు చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. తాము చదువుకున్న రోజుల నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఆటలు ఆడి, పాటలు పాడి అలరించారు. ఈ కార్యక్రమం ఆద్యంతం ఎంతో ఆహ్లాదకరంగా జరిగింది. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.విజయకుమారి, ఎంఈఓ మోకా ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: మూడున్నర దశాబ్దాల క్రితం కలసి పదో తరగతి వరకు చదువుకున్న స్నేహితులంతా సోమవారం రాజోలులో కలిశారు. పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక స్నేహితుడైన దారపురెడ్డ శ్రీవెంకటకుమార్(బాబ్జి) స్వగృహం వద్ద ఏర్పాటు చేశారు. 1989-90 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఒకచోట కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ హోదాల్లో స్థిరపడిన వారంతా నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించారు. స్నేహితులంతా ఒకచోట కలిసేలా కృషి చేసిన దారపురెడ్డి బాబ్జిని స్నేహితులు అభినందించారు.

అట్టహాసంగా సీఆర్‌సీ సంక్రాంతి సంబరాలు

రావులపాలెం: స్థానిక పోతంశెట్టి రామిరెడ్డి పార్కులో కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్ (సీఆర్‌సీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి, వేమన జయంతి సంబరాలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. తొలుత నాయకులకు సీఆర్‌సీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్కులోని వేమన విగ్రహానికి ఎమ్మెల్యే సత్యానందరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్కు వద్ద ఏర్పాటు చేసిన రంగుల రాట్నం, జెయింట్ వీల్, పిల్లలకు వినోదాన్ని పంచే కార్యక్రమాలను సత్యానందరావు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయరెడ్డి, చిలువూరి సతీష్ రాజు, సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి, సెక్రటరీ కర్రి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో పాలు పంచుకోవడం సంతోషం

సఖినేటిపల్లి: నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల్లో విదేశీయులు పాలుపంచుకోవడం సంతోషకరమని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక సమతా కల్యాణ మండపంలో రాజోలు వచ్చిన విదేశీయులతో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాజీ ఐపీఎస్ అధికారి మోరిష్‌బాబు, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జి.పెదకాపు, గెద్దం మహలక్ష్మి ప్రసాద్, తాడి మోహన్‌కుమార్ పాల్గొన్నారు.